# వెర్రివాణి

**వాణి** తన భర్తతో కలిసి అబిడ్స్‌లో నడిచి వెడుతూంటే, తన చిన్ననాటి మాస్టారు అచ్యుంతగారు కనిపించారు. అమాంతంగా ఆయన పాదాలకి నమస్కరించింది. అంత బిజీగా ఉన్న అబిడ్స్‌లో, అలా నమస్కారం పెట్టడం చాలా అరుదు. ఒక ఇరవైమందికి తక్కువ కాకుండా అలాగే ఆగిపోయి, ఆశ్చర్యంగా చూస్తూ ఉండిపోయారు.

"లే అమ్మా! ఏమిటిది" అన్నారు, అచ్యుంతగారు.

"నేను మాస్టారూ! మీ శిష్యురాల్ని. హైస్కూల్లో మీ దగ్గర చదువుకున్నాను. జ్ఞాపకం లేదా!" అంది వాణి.

వాణిభర్త ఇదంతా చూస్తూ. "నేనంటే అసలు పతిభక్తి లేదు దీనికి. కొత్తచీర ఎంత ఖరీదైనది కొన్నా, నా కాళ్లకి దండం పెట్టదు. అటువంటిది ఎప్పడో చిన్నప్పటి మాస్టారికి, ఇంత బిజీగా ఉన్న అబిడ్స్‌లో పాదనమస్కారం చేస్తోంది. పైగా జ్ఞాపకం లేదా అని అడుగుతోంది. బాగా చదివే వాళ్ళనే మాస్టర్లు గుర్తుపెట్టుకుంటారు. ఇటువంటి జీళ్ళ ఏబ్రాసిని, ఎవరు గుర్తుపెట్టుకుంటారు" అనుకున్నాడు.

"ఆ నువ్వుటమ్మా! ఎప్పడో చిన్నప్పుడు చూశాను. ఆ ఏం చదువుకున్నావు"

"బి.ఏ. చదువుతూంటే, పెళ్ళయిపోయింది మాస్టారూ! రెండు పార్టులు అలాగే ఉండిపోయాయి!" అంటూ "ఈయన నా భర్త ఆనంద్" అని తన భర్తను పరిచయం చేసింది.

"ఏం అమ్మా! ఎంత మంది పిల్లలు" అన్నారు మాస్టారు.

"పిల్లలు లేరు మాస్టారు!"

"అయ్యో! అటు చదువు పూర్తికాలేదు! ఇటు పిల్లలూ లేరు!" అంటూ "ఏం చేస్తున్నావయ్యా నువ్వు!" అన్నారు, ఆనంద్ కేసి తిరిగి.

"స్టేట్ గవర్నమెంట్‌లో పనిచేస్తున్నానండి" అన్నాడు ఆనంద్.

"ఏమిటి మాస్టారూ! మీరు హైదరాబాద్‌లోనే ఉంటున్నారా!" అంది వాణి.

"లేదమ్మా! సొంత ఊళ్లేనే ఉంటున్నాను. చాలా సంతోషమమ్మా! నిన్ను చూశాను. చాలా ఏళ్ళ తర్వాత నిన్ను చూశాను. నిత్యం స్కూలు మానకుండా వచ్చేదానివి" అన్నారు మాస్టారు.

"అవునండి మాస్టారు! మీకన్ని విషయాలు గుర్తున్నాయి" అంది వాణి.

"నేను ఎక్కువ సేపు నిలబడలేను, వస్తానమ్మా!" అని మాస్టారు వెళ్ళిపోయారు.

వాణి అంది ఆనంద్‌తో, "చూశారా! ఎప్పుడో ముప్ఫై ఏళ్ల క్రితం అక్కడ చదివాను. ఆయనకి అయినా నేను గుర్తున్నాను".

"వెర్రిమొహమా! నువ్వు గుర్తులేవాయనికి. గుర్తుంటే నువ్వు చిన్నప్పుడు జీళ్లు తినేదానివని, నీకు జీళ్లపాకం" అని పేరుండేదని చెప్పేవారు కదా'.

సాధారణంగా మాస్టార్లందరూ నమస్కారం మాస్టారూ, నేను గుర్తున్నానా! అంటే ఆహా నువ్వా! అని, "పెళ్లయిందా, ఎంత మంది పిల్లలు" అని ఎవర్నయినా అడగగలిగిన ప్రశ్నలు వేసి, సంతోషపెడతారు. అందులో నువ్వు పాద నమస్కారం కూడా పెట్టావు. మా పెద్దమామయ్య లెక్చరర్‌గా పనిచేసి రిటైర్ అయ్యాడు చూడు, ఆయన చెప్పాడీ సంగతి. పాపం! అయినా మాస్టార్లు కూడా ఎంతమంది శిష్యుల్ని గుర్తు పెట్టుకుంటారు!"

ఆనంద్ చెప్పింది విన్న తర్వాత, వాణి ఆనందం క్షణికమయింది.

(ఆంధ్రభూమి సచిత్రవారపత్రిక, 9-12-2004)